క్లుప్తంగా

నేడు పాండురంగ స్వామి కల్యాణం


శ్రీదేవి, భూదేవి సమేత పాండురంగడు

కోవెలకుంట్ల: పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత పాండురంగ వితలేశ్వరస్వామి దేవాలయంలో గత నెల 30న ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయ అర్చకులు వేణుగోపాలాచార్యులు, సుదర్శనాచార్యులు పంచామృతాభిషేకం, నూతన వస్త్ర అలంకరణ, విష్ణుసహస్రనామ స్తోత్ర పారాయణం, మహా మంగళ హారతి, తీర్థ ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం తెల్లవారుజామున స్వామివారి కల్యాణ మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేశారు.

చెన్నకేశవుడి ఆలయానికి పల్లకీ విరాళం


పల్లకీ అందజేస్తున్న దాతలు

అవుకు: స్థానిక కోటవీధిలో వెలసిన శ్రీ భూలక్ష్మీ సమేత చెన్నకేశవ స్వామి ఆలయానికి పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పోతిరెడ్డి శ్రీనివాస రెడ్డి బుధవారం సాయంత్రం పల్లకీని విరాళంగా అందజేశారు. అవుకు సొసైటీ అధ్యక్షుడు చల్లా విజయభాస్కర్ రెడ్డి, చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి, ఉపసర్పంచ్ చల్లా రఘునాథ్ రెడ్డి,దుగ్గిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, పోతిరెడ్డి శ్రీధర్ రెడ్డి, నంద్యాల త్రివిక్రమ వర్మతో కలిసి ఊరేగింపుగా వచ్చి పల్లకీ అందజేసి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.

లోకోస్ యాప్‌పై శిక్షణ

అవుకు: స్థానిక వైకేపీ కార్యాలయంలో బుధవారం మండలంలోనున్న వీఓఏలకు లోకోస్ యాప్‌పై శిక్షణ కార్యాక్రమం నిర్వహించారు. ఏపీఎం విజయగోపాల్ మాట్లాడుతూ పొదుపు సంఘాలకు సంబంధించి ఆపరేటింగ్ సిస్టమ్ దేశంలో ఒక్కో రాష్ట్రం ఒక్కో విధానాన్ని అనుసరిస్తోందన్నారు. ఇక నుంచి అన్ని రాష్ట్రాలను ఏకీకృతం చేస్తూ కేంద్రం ప్రభుత్వం ఒక వ్యవస్థను తీసుకొచ్చిందని తెలిపారు. సీసీలు,జయమ్మ, భీమేష్, రవి, అకౌంటెంట్ ఓబులేసు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

అవుకు: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి బలిజ సంఘం పెద్దలు అండగా నిలిచారు.పట్టణంలోని కోటవీధికి చెందిన గొడుగు ఈశ్వరయ్య కిడ్నీ సంబంధిత వ్యాధితో కొంతకాలంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న అవుకు బలిజ సంఘం పెద్దలు బాధితుడి స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. అతని బాగోగులు తెలుసుకొని రూ.15వేలు అందజేశారు. కునుకుంట్ల రమణ,రమణ, వేటూరి రమణ, జక్కా మధు, శనగల వెంకటేశ్వర్లు, వరప్రసాద్, సుబ్బయ్య, రామాంజనేయులు పాల్గొన్నారు.

పింఛన్ అందజేత


ఎస్వీ జయభారతికి హైదరాబాద్‌లో పింఛన్ అందజేస్తున్న వలంటీర్ షబ్బీర్ అలీబేగ్

బేతంచెర్ల: పట్టణానికి చెందిన ఎస్వీ జయభారతి అనే వృద్ధురాలు డయాలసిస్‌తో బాధపడుతూ హైదరబాద్‌లోని కూకట్ పల్లిలో రామ్‌దేవరావు హాస్పటల్లో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న స్థానిక 3వ గ్రామ సచివాలయం వలంటీర్ షబ్బీర్ అలీబేగ్ హైదరాబాద్‌కు వెళ్లి ఆమెకు పింఛన్ సొమ్ము అందజేశారు.

ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవాలి

బేతంచెర్ల: కూలీలందరూ ఏకమై ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఈశ్వరయ్య, మండల ప్రధాన కార్యదర్శి అర్జున్ తెలిపారు. బుధవారం మండలంలోని కొలుముల పల్లె గ్రామ సమీపంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించి, కూలీలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఇప్పటికే సమ్మర్ అలవెన్సు, అదనపు వేతనాలను రద్దు చేసిందని గుర్తు చేశారు.

రైతులకు పంట రుణాలివ్వాలి

డోన్ టౌన్ : అర్హత కల్గిన ప్రతి రైతుకు సకాలంలో పంట రుణాలు అందించాలని సింగిల్ విండో చైర్మన్ తిరుణాంపల్లె తిరుమల రెడ్డి సూచించారు. చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన ఆయన మొదటి సారిగా బుధవారం కోట్లవారి పల్లెలో ఉన్న సహకార బ్యాంక్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను గడువులో పూర్తి చేయాలని చెప్పారు. బ్యాంక్ లావాదేవీలు,పరిమితులు తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. సమావేశంలో బ్యాంక్ సీఈఓ సుబ్బయ్య, సచివాలయాల చైర్మన్ కురుకుంద హరి,కొత్తకోట ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి, నాయకులు శేషశయన గుప్త, గంగాధర్‌రెడ్డి, కృష్ణమూర్తి,భాస్కర్‌రెడ్డి ఉన్నారు.

వీడని వర్షం..రైతన్నకు నష్టం


జీరవోలు సమీపంలో నేలవాలిన వరి పంట


పెద్దరాజుపాలెం వద్ద నేలవాలిన మొక్కజొన్న పైరు


పసుపల వద్ద వర్షపు నీటిలో మునిగిన మొక్కజొన్న దిగుబడి

బనగానపల్లె: నాలుగు రోజులుగా బనగానపల్లె ప్రాంతంలో కురుస్తున్న అకాల వర్షాలకు రైతన్నలు పంటలు నష్టపోతున్నారు. నాలుగు రోజుల్లో 182.6 మీ.మీ. వర్షపాతం నమోదైందని అధికారులు పేర్కొంటున్నారు. ఇంతకుముందెన్నడూ ఈ స్థాయిలో వర్షం కురవ లేదని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. భారీ వర్షం వల్ల పంటలు బాగా దెబ్బతిన్నాయని రైతులు వాపోతున్నారు. వరి, మొక్కజొన్న పంటల సాగుకు ఎకరాకు రూ.25వేల నుంచి రూ.30వేలు వెచ్చించామని, ప్రస్తుతం పంట చేతికందే దశలో ఉందని, ఈ సమయంలో వర్షం కురవడంతో పైర్లు నేలవాయిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో రబీలో మొక్క జొన్న 14,200 ఎకరాలు, వరి 22వేల ఎకరాలు, మిరప 17వేల ఎకరాల్లో రైతులు సాగు చేశారు. ఈ నెల 15 నాటికి వరి మొక్కజొన్న పంట దిగుబడి లభించేదని, మిరప పంట కలాల్లో ఆరబోయగా రోజూ కురుస్తున్న వర్షంతో పంట తడిసి నాణ్యత తగ్గుతుందని వాపోతున్నారు. తడిసి రంగు వెలిసిపోయి, నాణ్యత పడిపోతుందని, దీంతో గిట్టుబాటు ధర లభించదని చెబుతున్నారు. పలు ప్రాంతాల్లో కొందరు రైతులు మొక్కజొన్న దిగుబడిని బయలు ప్రదేశాల్లో ఆరబోసుకోగా వర్షానికి తడిసి ముద్దయ్యింది.

నేటి నుంచి నరసింహ స్వామి జయంత్యుత్సవాలు

డోన్: మండలంలోని యాపదిన్నె గ్రామంలో వెలసిన లక్ష్మీ నరసింహ స్వామి జయంతి ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 10 గంటలకు స్వామి వారి కల్యాణం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. అదే రోజు రాష్ట్ర స్థాయి మహిళా కబడ్డీ పోటీలను నిర్వహిస్తామని, గెలుపొందిన వారికి రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేల వరుసగా బహుమతులు అందజేస్తామని చెప్పారు.

రేపు డయల్ యువర్ డీఎం

డోన్ టౌన్ : ఈ నెల 5వ తేదీన డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డోన్ ఆర్టీసీ డిపో మేనేజర్ శశిభూషణ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 11 నుంచి 12గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రయాణికులు, ప్రజలు నిర్ణీత సమయంలో 9959225795 నంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలు, సలహాలు, సూచనలు తెలియజేయాలని కోరారు.

మరమ్మతులు త్వరగా పూర్తి చేయండి

ప్యాపిలి: పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో రూ.64 లక్షలతో చేపడుతున్న మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేయాలని ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహ మరమ్మతు పనులను పరిశీలించారు. పనుల గురించి చీఫ్ ఇంజినీర్ వేణుగోపాల్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీధర్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. పస్టేట్ మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, తహసీల్దార్ చంద్రశేఖర వర్మ, ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, ఆర్ అండ్‌బీ ఏఈ మధు పాల్గొన్నారు.

విద్యార్థినికి సన్మానం

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని మానసను మంత్రి సన్మానించారు. బైపీసీలో 976 మార్కులతో ఉమ్మడి కర్నూలు జిల్లా టాపర్‌గా నిలిచింది. ప్రభుత్వ కళాశాల విద్యార్థిని కార్పొరేట్ స్థాయిలో ప్రతిభ చూపడంపై మంత్రి అభినందించారు.


ఆర్‌అండ్‌బీ అతిథి గృహం మరమ్మతు పనులను పరిశీలిస్తున్న మంత్రి

ప్యాపిలి: చంద్రపల్లె నుంచి పీఆర్ పల్లె వరకు పాదయాత్ర చేసిన ఆర్థికశాఖ మంత్రి పీఆర్ పల్లెలో రోడ్డు పక్కన ఉన్న హోటల్‌లో కాసేపు సేదతీరారు. ఈ సమయంలో కొందరు తమ సమస్యలను ఆయనతో చెప్పుకున్నారు. హోటల్‌లో సాధారణ వ్యక్తిలా కాఫీ తాగి కొద్దిసేపు ప్రశాంతంగా గడిపారు.

మంత్రిని కలిసిన డీటీసీలు

డోన్ టౌన్ : నంద్యాల జిల్లా రవాణ శాఖ అధికారి జీవీ.శివారెడ్డి, కర్నూలు జిల్లా ఉప రవాణాశాఖ అధికారి శ్రీధర్ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నంద్యాల జిల్లా రవాణ అధికారిగా జీవీ.శివారెడ్డి నియమితులైన సందర్భంగా బుధవారం మంత్రి బుగ్గనను ఆయన స్వగృహంలో కలిశారు. డోన్,కర్నూలు ఆత్మకూరు ఎంవీఐలు క్రాంతికుమార్,ఏఎస్ఎన్ రెడ్డి ఉన్నారు.


మంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న డీటీసీలు


మంత్రి బుగ్గన సమక్షంలో పార్టీలో చేరిన కొండపేట ముస్లిం మైనార్టీ నాయకులు

వైఎస్సార్‌సీపీలో చేరిక

డోన్ : రాష్ట్రంలోని ముస్లిం, మైనార్టీ ప్రజల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపట్టిందని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గనరాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. తన స్వగృహంలో మునిసిపల్ వైస్ చైర్మన్ జాకీర్ హుసేన్ నాయకత్వంలో కొండపేటకు చెందిన 60 టీడీపీ కుటుంబాలు ఆ పార్టీని వీడి బుధవారం మంత్రి బుగ్గన సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి మంత్రి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో అహమ్మద్ హుసేన్, రసూల్, ఇసాక్, స్వరూప్, నూర్ అహ్మద్, హనీఫ్, మాలిక్, షబ్బీర్, సమార్, జహీద్, జాకీర్, యూనుస్, మహబూబ్ బాషా, హనీఫ్, అన్వర్, ఖాజామొహిద్దీన్, గౌస్‌పీరా, ఫిరోజ్, షాకీర్, అప్సర్, ఇబ్రహీం, షాహీద్, మజీద్, గౌస్, హుసేన్‌బాషా, మహమ్మద్ షరీఫ్, మహబూబ్ బాషా, యూనుస్ బాషా, అల్తాఫ్ యుద్రుస్, ఖలీల్, సిదార్‌హుసేన్, యూసుఫ్‌తో పాటు మరో 30 కుటుంబాలు ఉన్నాయి.

మునిస్వామికి నివాళి

డోన్ టౌన్ :లారీ మోటార్ వర్కర్స్ యూనియన్ మాజీ కార్యదర్శి కామ్రేడ్ మునిస్వామికి యూనియన్ నాయకులు, కార్మికులు నివాళులర్పించారు. మునిస్వామి 7వ వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో కార్యదర్శి శివరాం అధ్యక్షతన ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. సీపీఎం సీనియర్ నాయకుడు కొండన్న, యూటీఎఫ్ రాష్ట్ర మాజీ గౌరవ అధ్యక్షులు నరసింహులు, న్యాయవాది,వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగభూషణంరెడ్డి, యూనియన్ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యంశెట్టి తదితరులు పాల్గొన్నారు.

రెండు కోట్ల ఉద్యోగాలు ఏవీ?

డోన్ టౌన్: తాము అధికారంలోకి వస్తే రెండు కోట్ల ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన బీజేపీ ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న ఉద్యోగాలను కూడా కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారని అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పులిశేఖర అన్నారు. ఏఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం స్థానిక నక్కి రామన్న భవన్ వద్ద అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు.

బనగానపల్లెరూరల్: విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయడాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఐ, సీపీఎం,ఏఐటీయూసీ,వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక పెట్రోల్ బంకు సర్కిల్‌లో బుధవారం ధర్నా కార్యక్రమం నిర్వహించారు.

సొంతింటి కల నెరవేర్చుకోవాలి

కోవెలకుంట్ల: పక్కాగృహాలు మంజూరైన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేపట్టి సొంతింటి కల నెరవేర్చుకోవాలని ఎంపీడీఓ మహబూబ్‌దౌలా, డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్ సూచించారు. పట్టణ శివారులోని జగనన్న కాలనీలో నిర్మితమవుతున్న ఇళ్ల నిర్మాణాలను బుధవారం పరిశీలించారు.

హక్కుల సాధనకు ఉద్యమించాలి

ప్యాపిలి: హక్కుల సాధనకు కార్మికులు మే డే స్ఫూర్తితో ఉద్యమించాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు లంక సుబ్బరాయుడు, సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి చిన్న రహిమాన్ పిలుపునిచ్చారు. మండలంలోని జలదుర్గం గ్రామంలో బుధవారం మే డే నిర్వహించారు.

అంగన్‌వాడీ కార్యకర్తలుగా పదోన్నతి

కోవెలకుంట్ల: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీలో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయాలుగా పనిచేస్తున్న ఇద్దరికి పదోన్నతి లభించిందని సూపర్‌వైజర్ గీతా లక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలోని ఎనిమిది, నాలుగు కేంద్రాల్లో ఆయాలుగా పనిచేస్తున్న మల్లిక, గంగమ్మ అంగన్‌వాడీ కార్యకర్తలుగా పదోన్నతి పొందారన్నారు. రెండు కేంద్రాల్లో కార్యకర్తల పోస్టులు ఖాళీగా ఉండటంతో పదవ తరగతి పాసై, 45 సంవత్సరాల్లోపు వయస్సు ఉండి, ఆయాగా పది సంవత్సరాల అనుభవం ఉన్న వీరికి పదోన్నతి కల్పించారన్నారు. ఈ మేరకు ఆయా కేంద్రాల్లో కార్యకర్తలుగా వారు బాధ్యతలు చేపట్టారని చెప్పారు.

ఉపాధి పనులు వేగవంతం చేయాలి

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ మహబూబ్‌దౌలా, ఏపీఓ శ్రీవిద్య సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్‌కార్యాలయంలో మండలంలోని ఆ పథక టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వ్యవసాయ పనులు పూర్తిగా ముగిసిన దృష్ట్యా గ్రామాల్లో అడిగిన వారందరికీ ఉపాధి పనులు చూపాలని ఆదేశించారు. ప్రతి కుటుంబానికి వంద పది దినాలు కల్పించే బాధ్యత ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లపై ఉందన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు జయభారత్‌రెడ్డి, కొండయ్య పాల్గొన్నారు.

5న స్వాతి నక్షత్ర వేడుకలు

బనగానపల్లెరూరల్: పట్టణంలోని రవ్వకొండ సమీపంలో ఉన్న చెంచులక్ష్మి పావన నరసింహస్వామి ఆలయంలో ఈ నెల 5వ తేదీన స్వాతి నక్షత్ర వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ అర్చకులు, ఆలయ వ్యవస్థాపకులు బాలిశెట్టి పావననరసింహమూర్తి బుధవారం తెలిపారు. ఉదయం స్వామి వారికి అభిషేకం తదితర ప్రత్యేక పూజలు ఉంటాయని చెప్పారు.

నేడు నందవరంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

బనగానపల్లె: మండలంలోని నందవరం గ్రామంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి బుధవారం తెలిపారు. మధ్యాహ్నం నుంచి నిర్వహించే కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పాల్గొని ఇంటింటికీ తిరిగి పథకాలు, పాలన గురించి వివరించి, సమస్యలు తెలుసుకుంటారని చెప్పారు.

అంగన్‌వాడీ చిన్నారులకు ఆధార్ కార్డులు


చిన్నారికి ఆధార్‌కార్డు అందజేస్తున్న ఎంపీడీఓ సుబ్బరాజు

కొలిమిగుండ్ల: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లోనున్న చిన్నారులకు ఆధార్‌కార్డులు అందజేస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్బరాజు బుధవారం తెలిపారు. స్థానిక సచివాలయంలో జరుగుతున్న ఆధార్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో 0–5 ఏళ్లలోపు చిన్నారులకు ఆధార్ నమోదు చేస్తున్నామని, తల్లిదండ్రులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆధార్‌కార్డులేని చిన్నారులను గుర్తించినట్లు చెప్పారు.

ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ ఆపాలి


రాస్తారోకో నిర్వహిస్తున్న దృశ్యం

బేతంచెర్ల: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని సీపీఎం పట్టణ, మండల ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వర్లు, ఈశ్వరయ్య తెలిపారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయం నుంచి పాత బస్టాండు వరకు సంజీవరాయుడు అధ్యక్షతన రాస్తారోకో నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రాయలసీమ ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ, పోలవరం ప్రాజెక్టుకు నిధులు, రైల్వే జోన్ ఇవ్వకపోవడంపై మండిపడ్డారు. అలాగే విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు భార్గవ్, ఏలియా,ఎల్లకృష్ణ, శ్రీకర్ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు.

డోన్ టౌన్: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను అపాలని కోరుతూ వామ పక్షాల ఆధ్వర్యంలో బుధవారం రాస్తారోకో నిర్వహించారు. పట్టణంలోని గుత్తి రోడ్డు అమ్మ హోటల్ సమీపంలోని సీపీఐ సర్కిల్ వద్ద రోడ్డుపై బైఠాయించారు. సీపీఐ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు మాట్లాడుతూ 32 మంది ప్రాణాలు బలిదానం చేసి, ఎందరో రైతులు తమ భూములను ఇచ్చి సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమ వేలాది మందికి ఉద్యోగవకాశాలు, మరెందరికో పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్న సంస్థను కేంద్ర ప్రభుత్వం కార్పొరేటర్లకు అప్పగించడం సరికాదన్నారు. విషయం తెలుసుకున్న పట్టణ పోలీసులు నాయకులను అరెస్టు చేశారు.నాయకులు మోటా రాముడు, సురేంద్ర, ప్రసాద్, దేవమని, సుగుణమ్మ పాల్గొన్నారు.

పంట రక్షణ చర్యలపై అవగాహన కల్పించండి

అవుకు: మండలంలోని సాగు చేసిన పంటల్లో చేపట్టాల్సిన రక్షణకు చర్యలపై రైతులకు అవగాహన కల్పించాలని మండల వ్యవసాయ అధికారి ప్రసాద్ రావు వీఏఏలకు సూచించారు. బుధవారం మండలంలోని గుండ్లశింగవరం, అన్నవరం గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాలను తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వరి పంట అన్ని చోట్ల కోత దశలో ఉన్నదని, ఇటీవల కురిసిన వర్షాలకు చాలా చోట్ల పంట నేలవాలిందన్నారు. పంటను రక్షించుకోవడంపై వారికి తగు సూచనలు చేయాలన్నారు. వరి పొలాల్లో ఉండిపోయిన నీటిని పూర్తిగా తొలగించి, నేలవాలిన వరిని కట్టలుగా కట్టాలని తెలిపారు. అలాగే ఉప్పు ద్రావణంతో పిచికారీ చేసేలా రైతులకు వివరించాలని చెప్పారు. దీనివల్ల కొంతమేర పంట నష్టం జరుగకుండా కాపాడుకోవచ్చన్నారు. అలాగే..భూసార పరీక్షల ద్వారా కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించి, ప్రతి ఒక్కరూ భూసారా పరీక్షలు చేయించుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు.


చిన్నరాజుపాలెంలో పూజలందుకున్న పెద్దమ్మ,


క్రిష్ణగిరిలో పెద్దమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

ఘనంగా పెద్దమ్మ దేవర

బనగానపల్లెరూరల్: మండలంలోని పెద్దరాజుపాళెం , క్రిష్ణగిరి గ్రామాల్లో పెద్దమ్మ తల్లి దేవర బుధవారం గ్రామ రైతు సంఘం, ప్రజల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం అర్ధరాత్రి ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం తెల్లవారుజాము నుంచి గ్రామస్తులు బోనాలను నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన సంఘం అధ్యక్షుడు గుండంనాగేశ్వరరెడ్డి, అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, పెద్దరాజుపాళెం సర్పంచ్ మోహన్‌బాబు, మార్కెట్‌యార్డు ఉపాధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి, ఆర్యవైశ్య సంఘం నాయకుడు శ్రీరామవెంకటసుబ్రహ్మణ్యం, నాయకులు మాధవరెడ్డి, చెన్నారెడ్డి, రామసుబ్బారెడ్డి, జగదీశ్వరరెడ్డి, అంబటిరవికుమార్‌రెడ్డి పాల్గొన్నారు. బనగానపల్లె ఇన్‌చార్జ్ సీఐ ప్రీతంరెడ్డి, బనగానపల్లె, అవుకు,నందివర్గం,రాచర్ల ఎస్ఐలు జీవన్‌బాబు,వీరాంజనేయులు, జగదీశ్వరరెడ్డి, హుసేన్ బాషా ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నాణ్యమైన ఎరువులు, విత్తనాలు విక్రయించాలి

డోన్ టౌన్: రైతులకు నాణ్యమైన విత్తనాలు,ఎరువులు,మందులు ఎమ్మార్పీకే విక్రయించాలని డోన్ డివిజన్ వ్యవసాయశాఖ ఉప సంచాలకులు అశోక్‌వర్దన్ రెడ్డి డీలర్లకు సూచించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని బుధవారం మండల పరిషత్ సమావేశ భవనంలో డివిజన్‌లోని డోన్,ప్యాపిలి,బేతంచెర్ల మండలాలకు చెందిన ఎరువులు,విత్తనాలు,క్రిమి సంహారక మందుల డీలర్లతో సమావేశం నిర్వహించారు ఆయన మాట్లాడుతూ డీలర్లకు ఎరువుల చట్టాల గురించి అవగాహన కల్పించారు. ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే లైసెన్సులు రద్దు చేసి, క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు. సమావేశంలో వ్యవసాయశాఖ విస్తరణాధికారులు అబ్దుల్ షఫి, నవీన, చంద్రశేఖర్, ప్రమీల,రాధ,రాజు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏడీఏ అశోక్‌వర్ధన్‌రెడ్డి

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

బేతంచెర్ల: పట్టణంలోని కోటపేట కాలనీకి చెందిన ఓ మహిళను ఇంటి స్థలం విషయంలో కులం పేరుతో దూషించారని బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఏఎస్ఐ లింగమయ్య బుధవారం తెలిపిన వివరాల మేరకు.. కాలనీకి చెందిన మేకల నాగరాజు భార్య సీతమ్మతో ఇంటి స్థలం విషయంలో షమీమ్, గఫార్, హరున్ వాదనకు దిగారు. ఈ క్రమంలో కులం పేరుతో దూషించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ చెప్పారు.

వాగులో వృద్ధుడు గల్లంతు

సంజామల(కోవెలకుంట్ల): సంజామల మండలం కమలపురి సమీపంలో ప్రవహిస్తున్న వాగులో బుధవారం రాత్రి ఓ వృద్ధుడు గల్లంతయ్యాడు. కోవెలకుంట్ల సీఐ నారాయణరెడ్డి తెలిపిన వివరాల మేరకు..హోత్రమాన్‌దిన్నె గ్రామానికి చెందిన తలారి కంబగిరి (76)తో పాటు పాటు బంధువులు ఆటోలో ఓ వివాహ కార్యక్రమానికి వెళ్లి తిరుగు ప్రయాణమయ్యారు. అవుకు మండలంలో రెండు రోజుల నుంచి కురుస్తున్న అకాల భారీ వర్షాల కారణంగా వాగులు, వంకలు, పొలాల్లోని వర్షపునీరంతా హోత్రమాన్‌దిన్నె- వసంతాపురం గ్రామాల మధ్య ప్రవహిస్తున్న వాగుకు పోటెత్తింది. అయితే వరద ఉధృతిని గమనించి డ్రైవర్ ఆటోను నిలిపివేశాడు. వాగులో పెద్దగా నీటి ప్రవాహం లేదని కంబగిరి వాగులో దిగడంతో నీటి ప్రవాహానికి కొట్టుకపోయాడు. వృద్ధుడి ఆచూకీ కోసం బంధువులు గాలింపు చర్యలు చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.


కంబగిరి స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్మాణంలోనున్న అమ్మవారి ఆలయం,


గుండాల చెన్నకేశవ స్వామి ఆలయ ప్రాంగణంలో రూపుదిద్దుకుంటున్న అమ్మవారి ఆలయం,


మద్దిలేటి స్వామి ఆలయ ఆవరణలో నిర్మాణంలో ఆలయాలు

పురాతన ఆలయాలకు మహర్దశ

డోన్: చరిత్రాత్మకమైన పురాతన ఆలయాల జీర్ణోద్ధరణకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. నియోజకవర్గంలోని పలు దేవాలయాల్లో జీర్ణోద్ధరణ పనులను చేపట్టేందుకు దేవదాయ ధర్మదాయ శాఖ అధికారులు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం పనులు వేగంగా సాగుతున్నాయి. బేతంచెర్ల మండలం మద్దిలేటిస్వామి ఆలయ జీర్ణోద్ధరణ పనులకు రూ.3.90కోట్లు, డోన్ మండలం గుండాల చెన్నకేశవ స్వామి ఆలయ అభివృద్ధికి రూ.1.78 కోట్లు, గాలిగోపురం నిర్మాణానికి రూ.2.26 కోట్లు, అవుకు మండలం కంబగిరి స్వామి ఆలయ ప్రాంగణంలో లక్ష్మిదేవి అమ్మవారి ఆలయ నిర్మాణానికి రూ.2కోట్లు ఖర్చు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. పనులు పూర్తయితే ఆలయాలకు పూర్వ వైభవం వస్తుందని ఆయా గ్రామాల ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.